# ఆత్మకథ

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

ఈ కథ రాసేముందు 'ఆత్మహత్య' అని పేరుపెట్టి, లౌకికదృష్టిలో ఆపని జరగందే ఆ పేరు పెట్టడం సబబుకాదేమో నని ఆత్మకథగా మార్చేను. అసలు ఆనాటిరాత్రి నేను ఆత్మహత్య చేసుకోనేందుకు చేసిన ఆలోచన లిన్నీ అన్నీ కావు. అప్పుడు నాకు స్ఫురించిన విధానాల్లో ఏవిధంవల్ల ప్రాణం పోగొట్టుకొని ఉన్నా నా కిది రాయవలసిన అవసరం పట్టేది కాదు. అంటే చచ్చిపోయిన మనిషి మరి రాసేదేమిటని అంటారేమో? నా ఉద్దేశం అది కాదు. అలా జరిగిఉండేటట్లయితే నేను ఎంతో గొప్పపని చేసినట్లుగా నన్ను తెలిసినవాళ్లందరూ చెప్పుకొని ఉందురు. అంతేకాక ఏ కవికుమారుడో, నాటకరచయితో నాయెడల తనకు కలిగిన సానుభూతికి చిహ్నంగా ఒక ఖండకావ్యమో, నాటికో రాసి ఉంచేవారు— 'త్యాగశ్రీ' అనో, 'త్యాగగరిమ' అనో పేరుపెట్టి. కాని తీరా నేను ఆత్మహత్య చేసుకోక పోవడంవల్ల ఆ అవకాశంఏమో పోయింది. కాని, నేను చేసినది వట్టి సామాన్యమయిన పనిగానే లోకందృష్టిలో ఉన్నా, (అసలు అదీ ఒకపనిగా గుర్తించనివాళ్లుకూడా ఉన్నారు) అందులోనూ త్యాగంచెయ్యడం అనేటటువంటిది కొంత ఉందని నామనస్సు కొంత పీకుతూండడంచేత, దానిని లోకానికి తెలియజేసి నాబరువు వదిలించుకోవాలనే ఉద్దేశంతో నేనే కలంపట్టుకొన్నాను.

నా పేరు శకుంతల. మాతల్లిదండ్రులకి కలిగిన నలుగురు ఆడపిల్లలసంతానంలోనూ నేనే ఆఖరుదానిని. మాముగ్గురు అక్కలూ నాకంటే చాలా పెద్దవాళ్లు. వాళ్లలో వాళ్లకి ఒకటిరెండేళ్లకంటె భేదం లేదుగాని, నాకూ మా చిన్నక్కయ్యకీ, పదకొండేళ్ల వార ఉంది వయస్సులో. అంటే వాళ్లంతా పెళ్లిళ్లయి, తమతమ సంసారాలు తిప్పుకొంటూ, తమ పిల్లల పెళ్లిళ్లగురించి కూడా ఆలోచనలు చేసేకాలంలో, ఇంట్లో పెళ్లికాకుండా చిన్నపిల్లగా ఉండేదాన్ని నేనొక్కతెనే. మా పెద్దక్కయ్య తన సంసారం పెద్దదవడంవల్ల ఎప్పుడో కాని వచ్చేది కాదు. మూడవఅక్కయ్యను వాళ్ల అత్తవారు ఏడాదికి ఒకమారు పంపి, ఒక్క పది రోజులుమాత్రమే ఉంచేవారు. ఇక, రెండవ అక్కయ్యమాత్రమే ఏడాదికి ఒకటిరెండుమార్లు రావడం, ఒకనెల రెండునెలలు ఉంటూఉండడం జరిగేది. ముఖ్యంగా వేసవికాలం రెండునెలలూ మాబావకీ (ఆయనస్కూలుమాష్టరు), పిల్లలకీకూడా శలవులవడంమూలాన, కుటుంబాన్ని పుట్టింట్లో విడిచి ఆయన ఏవేవో చరిత్రాత్మకప్రదేశాలనీ, దేవాలయాలనీ, స్నేహితులనికలియడానికనీ తిరుగుతూఉండేవారు. ఈవిధంగా మా రెండవఅక్కయ్యతో నాకు కొంచెం ఎక్కువ కలయిక ఉండేదిగాని, తక్కినవాళ్లంటే ఏదో ఎప్పుడో వచ్చివెళ్లే బంధువులను చూసినట్లే ఉండేది. కాగా, మొత్తం ఏడాదిలో ఇంటిదగ్గర ఉండే చిన్నపిల్లను నేనొక్కతెనే—

నాపన్నెండవఏట మానాన్న ఒకానొక ఎలిమెంటరీస్కూలు హెడ్మాష్టరుపనినుండి రిటైరయేరు.

అప్పటినుండీ, ఇంట్లో నా పెళ్లినిగురించిన మాటలు అడపాదడపా వినిపిస్తూనేఉండేవి. నాకు పెళ్లిచేసి, నన్ను ఒక ఇంటిదాన్ని చేస్తే మా అమ్మకూ నాన్నకూ మరేవిచారం ఉండదన్నది వాటి సారాంశం.

అయితే ఈవిధమయిన మాటలు ఇంట్లో అప్పటి నుండీ సుమారు ఒకేపద్ధతిని నాపదిహేడవసంవత్సరం వరకూ జరుగుతూనే ఉండేవి.

మొట్టమొదటిలో తెలియకపోయినా, క్రమంగా కొన్నాళ్లకి నాకు మావాళ్ల మాటలలోని ముఖ్యమయిన లోపం తెలియడమూ, అవి వినడంఅంటే ఒకవిధమయిన చికాకు ఏర్పడడమూ సంభవించింది. అవి వాళ్లలో వాళ్లు అనుకునేమాటలే కానియ్యండి, నాకు సంబంధించినవిఅయి, నా చెవులలో పడుతూంటే మాత్రం చాలా అరుచిగా ఉండేది. సంగతి ఏమిటీ అంటే మాఅమ్మా, నాన్నా అన్నిటికంటే ముఖ్యమయిన డబ్బు అన్నదానినిగూర్చి ఆలోచనలేకుండా, తక్కిన చిల్లరచిల్లరవిషయాలే అతిప్రధానమయినవి అన్నట్లుగా చర్చిస్తూఉండేవారు.

ఎవరో ఫలానాఅబ్బాయి ఉన్నాడనుకోండి, అతనికి ఇవ్వవలసిన కనీసపుకట్నం ఇంతా అని తెలుస్తూఉండి, ఆ కనీసపుకట్నంకూడా మనం ఇచ్చుకోలేమన్నది నిర్వివాదాంశమయినా, ఏవేవో కబుర్లు ఆ అబ్బాయిశరీరపురంగు గురించి, తెలివి తేటల గురించి, చేయడానికి వీలున్న ఉద్యోగాలగురించి, వాళ్ల కుటుంబస్థితిగతులనూ సంప్రదాయాలనూ గురించి, వాళ్ల ఇంట్లో ఉన్న ముసలమ్మలు ఇంటికి రాబోయే కొత్తకోడలిమీద చలాయించే అధికారం గురించీ అలా రోజులతరబడిని, చివరకు ఆఅబ్బాయి పెళ్లి ఎక్కడో నిశ్చయం అయేపర్యంతం చర్చిస్తూ ఉండడంమాత్రం నాకు నిజంగా చాలా బాధగా ఉండేది.

ఈబాధ నేను చదువు మానేసినప్పటినుండీ మరీ ఎక్కువయిందనిపిస్తుంది. ఊర్లో మిడిల్‌స్కూలుండడమూ, జీతం కట్టక్కరలేకపోవడమూ ఈ రెండు కారణాలవల్లా, నా డ్నాలుగవఏట మూడవఫారము పాసయేవరకూ నిర్విచారంగానే గడిచి పోయింది—చేయవలసిన ఒక నిశ్చయమయిన పని అంటూ ఉండడంచేత. ఆతరవాత నేను ఎల్లప్పుడూ ఇంటిదగ్గర ఉండడంవల్లనే కాదు, మావాళ్లు నాపెళ్లిగురించి పడే ఆతృత మరీ ఎక్కువయి, రోజల్లా అవేమాటలు ఆడుతూండడంవల్ల వాటిమూలంగా నాకు కలిగే తలనొప్పి మరీ విపరీతమయిపోయింది.

మాఅమ్మకీ నాన్నకీ తక్కిన చిన్న చిన్న సంగతులలో ఐక్యం కుదరకపోయినా, నాపెళ్లికిసంబంధించిన కాలక్షేపపు కబుర్లలోమాత్రం అద్భుతంగా పొత్తు కుదిరేది. ఒకరు ఒకమాట మొదలుపెట్టి సగం చెప్పేసరికల్లా రెండవవారు జంటకవులు శతావధానం చేసినట్టు, అది అక్కడ అందుకొని పూర్తిచేయడం జరిగేది. ఇల్లా అస్తమానం తమలోతాము ఏదో చర్చించుకోడంతో గడిపితే నేనంతగా చికాకుపడకపోయి ఉందును. మధ్యమధ్యను అనవసరంగా కేవలం నా ఒక్కతె ఇష్టమే తరవాయి అయి తక్కిన అన్ని సంగతులూ నిశ్చయమయిపోయినట్లుగా నన్ను సలహా చేస్తూఉండేవారు. ఎందుకు, నన్నడగక్కర్లేదంటే ఊరుకొంటారా? ఏవేవో కారణాలు చెప్పితీరవలసిందే. పోనీ అంతతో ఆగినా బాగుండును. ఒక్కొక్కప్పుడు ఏదో ఎల్లాగూ జరగనిదానికి ఏకారణమయితే నేమి అన్నట్లుగా నేను ఇంట్లో చెప్పిన ఏదోకారణాన్ని పట్టుకొని మా అమ్మ నలుగురిలోనూ ప్రగల్భంగా చెప్పేది: 'మా శకుంతలమ్మకి ఫలానాఅబ్బాయి ఆయీకారణాలవల్ల నచ్చలేదు'అని. కేవలం నా నచ్చకపోవడంవల్లనే పెళ్లి ఆగిపోయినట్లుగా మాట్లాడేది. కాని లోకం మరీ అమాయికమయినదీ, చిన్న చిన్న కారణాలు ఊహించలేనిదీ కాదుకదా! అసలుసంగతిగూర్చి తమలోతాము గుసగుసలు చెప్పుకొని నవ్వుకొంటూఉండేవారు. ఒక్కొక్కప్పుడు నన్నూ నిలవేసి అడుగుతూండేవారు ఇరుగుపొరుగులవారు—"ఏమిటి శకుంతలా సంగతి?"అని. ఇంతకంటే బాధ మరేముంటుంది? నాకు అందుబాటులో లేనివాటిని నేను నచ్చలేదనడంకంటె నవ్వులాటకు పాత్రమయిన సంగతి మరేముంటుంది. నిజంగానే నచ్చకపోయినా ఆమాట చెప్పడానికి నాకు హక్కు లేదు అనిపించేది.

ఇల్లా ఒక రెండున్నరసంవత్సరాలు గడిచేయి. నాకు పదిహేడవఏడు నడుస్తూంది.

నాకంటె ఒక ఏడాదిన్నర చిన్నదయినా, కమలతో ఉన్న స్నేహం నాకు మరెవ్వరితోనూ లేదు. నాలాగే వాళ్ల ఇంట్లోనూ అదొక్కతే చిన్న ల్లి. కాని, భేదం ఎక్కడుందీ అంటే, నేను మా తల్లిదండ్రులకి ఆఖరిసంతానం కావడంవల్ల నా పదహారవ సంవత్సరం వేళకి మానాన్నకి అరవై ఏళ్లు దాటేయి; మా అమ్మవయసుకూడా యాభైపైనే. ఎంతో నాకు సరిగా తెలీదు. వాళ్ల అమ్మ నాన్నకి అప్పుడు వరసగా ముప్ఫై, ముప్ఫైఅయిదు ఉండేది వయస్సు; పైగా వాళ్ల నాన్న ఒకమాదిరి కవికూడాను. అందుచేత, వాళ్ల అమ్మనాన్నాదృష్టికీ, మా అమ్మ నాన్నాదృష్టికీ పిల్లలను చూసేవిధానంలో బ్రహ్మాండమైన భేదం ఉండేది. మా అమ్మ నాన్నా నాకు ఏదో విధంగా పెళ్లిచేసేసి తమ బాధ్యత ఒదిలించుకోవాలని చూస్తూఉంటే, వాళ్ల అమ్మనాన్నా దాని చేత సంగీతసాహిత్యాలలో అమోఘమయిన కృషిచేయించి, దానిని ప్రపంచం-అంటే అధమం తెలుగుదేశం-అంతటికీ వెలుగు తేవలసిన పెద్దనక్షత్రంగా తయారుచేయాలని ఎన్నెన్నో ఆశలు పెట్టుకొనేవారు.

స్కూలులో చదువుచెప్పే పద్ధతివల్ల అనవసరంగా కాలం వృథా అవడంతప్ప ఫలితం అట్టే ఉండదనీ, ఇంగ్లీషు తెలుగు సాహిత్యాలు తానే ఇంటిదగ్గర చెప్తాననీ, సంగీతం వేరేమాష్టరుదగ్గర నేర్చుకొంటే చాలుననీ, వాళ్ల నాన్న కమలచదువు రెండవఫారంతో ఆపుచేయించేరు.

కొద్దిరోజులు, అనుకొన్నట్లుగానే, దాని చదువూ సంగీతం జరిగినా, క్రమంగా వాళ్ల నాన్నకి భూముల వ్యవహారాలూ, తన రచనలగొడవా వీటి మూలంగా కూతురుకి చదువుచెప్పే ఓపికా, ఉత్సాహమూ తగ్గిపోయేయి. కొన్నాళ్లకి ఎప్పుడెప్పుడో ఒక్కనాడు ఆయన తనకు నచ్చిన ఏవేవో పుస్తకాలు అక్కడక్కడా చదివి అర్థంచెప్పడమూ, దినపత్రికలోని వార్తలనూ, నాయకుల ప్రసంగాలనూ చదివి చర్చించడమూ, అంటే తన అభిప్రాయాలను కూతురుకి చెప్పడమూమాత్రంగా తయారయింది దానికి చదువు చెప్పే విధానం. ఇక సంగీతంలోనూ, మొట్టమొదటి ఆపట్టుదలా, ఉత్సాహమూ దానికీ, వాళ్ల నాన్నకీకూడా అట్టేకాలం మిగలలేదు. అయితే నెలకి ఇంతా అని జీతమిచ్చి ఉంచిన ఉపాధ్యాయుడుండడంమూలాన కొంత ఫలితంమాత్రం కనబడకపోలేదు. వయొలిన్ ఒకమాదిరిగా బాగానే వాయిస్తుంది నేర్చుకొన్నంతవరకూ. కాని, గాత్రంమాత్రం అనువయినది కాదు. ఇక నేను, సంగీతం అని వేరే నేర్చుకోకపోయినా, గాలిపాటగా, అక్కడక్కడ విన్న పాటలన్నీ ఒకమాదిరిగా తిరిగీ అనగలిగేదానిని.

మాయిద్దరికీ ఆరంభంలో స్నేహం కుదరడానికి సంగీతమే ముఖ్యమయిన కారణం. మొదట కొన్నాళ్లు సక్రమమూ, శాస్త్రీయమూ అయిన ఆమెవాద్యాన్ని నేను మెచ్చుకోవడమూ, నా గాలిపాటను చాలా హాయిగా ఉందని ఆమె మెచ్చుకోవడమూ వీటితో ఆరంభమయింది మా స్నేహం. అయితే కొన్నాళ్లకి స్నేహం బలంగా అయినతరవాత, సంగీతం చాలా అప్రధానమయి, ప్రపంచంలో స్త్రీలకు సంబంధించిన అన్నిసమస్యలూ మావే అన్నట్లుగా చర్చించుకొనేవాళ్లము.

ఒకస్కూలు స్థాపించి ఉచితంగా చదువూ, సంగీతమూ, అల్లికపనులూ, కుట్టుపనీ మొదలయినవి నేర్పి స్త్రీలను తమమీద తాము ఆధారపడేట్టుగా చెయ్యాలనీ, మరినలుగురు సంగీతంలో అభిరుచి ఉన్న అమ్మాయిలను పోగుచేసుకొని, దేశంపాడుగునా పాటకచేరీలు చేస్తూ, సక్రమమయిన సంగీతాభిరుచిని జనసామాన్యంలో కలిగించాలనీ, స్త్రీలకి సంబంధించిన సమస్యలను నిర్మొగమాటంగా చర్చించి పరిష్కారమార్గాలను సూచించడానికి ఒక పత్రిక స్థాపించి నడిపించాలనీ, అల్లా ఒకటేమిటి ఎన్నెన్నో పెద్దపెద్ద పథకాలను వేస్తూఉండేవాళ్లము. అప్పట్లో మాకు ఈ మా చర్చలు ఎంతో ముఖ్యమయినవిగానూ, ఇవి సక్రమంగా జరగకపోవడము మొత్తంప్రపంచం అంతటికీ పెద్దనష్టం అన్నట్లుగానూ రూపించేది. ముఖ్యంగా మేము ఎల్లప్పుడూ ఇటువంటి మాటలు మాట్లాడుతూండడం మూలానేనేమో, నాకు మాఅమ్మనాన్నా తమలో

తాము నాపెళ్లిగురించి ఆడుకొనే మాటలు మరీ సంకు చితంగా రూపించి చికాకుకలిగించే వనుకొంటాను.

ఆవిధంగా కేవలం మాటలతోనే ఎంతకాలం గడిచిఉండునో చెప్పలేను. మా అక్కయ్యలు తాము వచ్చినప్పుడే కాదు, అప్పుడప్పుడు ఉత్తరాలలోనూ, ఇంకా నాపెళ్లి చేయకపోవడం అనేది మాఅమ్మ నాన్నా చేస్తూండిన ఘోరమయిన నేరం అని ఉటంకిస్తూ, ఏవేవో వాళ్లకి తెలిసిన సంబంధాలను గూర్చి తెలియజేసి, తమతమ సలహాలిస్తూ ఉండేవారు. ఈ రకంగా బైటనుండి కదలిక వచ్చినతరవాత కొద్ది రోజులు మాఅమ్మ నాన్నా చేసే చర్చలు మరి ఎక్కువరాత్రివరకూ జరుగుతూండేవి. మళ్లీ మరికొద్ది రోజులకి మామూలే మాటలన్నీ — కాలక్షేపసాధనాలు మాత్రం అన్నట్లుగానే తయారయేవి.

నేనూ, కమలా మా పెద్దపెద్ద యావత్ స్త్రీలోకానికీ సంబంధించిన ఆలోచనలూ, మాఅమ్మ నాన్నా నాపెళ్లినిగురించిన ఆలోచనలూ చేస్తూండినకాలంలో, వాళ్ల అమ్మనాన్నా దానిగురించి ఏమాలోచించేవారో చెప్పడం కష్టం. కాని, దానిని చదువు మాని పించేటప్పుడు వాళ్ల నాన్న చెప్పిన మాటలనే ఆయన తరవాత మనసులో పెట్టుకొన్నా రనడానికి వీల్లేదు. కమల సంగీతంలో, సాహిత్యంలో పెద్ద విద్వాంసురాలు కొందే పెళ్లిచేసుకోదనీ, అప్పుడైనా, ఆమె తన ఇష్టం ఉంటే తనకు వచ్చిన ఏమహాసంగీతజ్ఞుడినో, మరొక కళాతపస్వినో పెళ్లిచేసుకొంటుందనీ, లేకపోతే కేవలం కళకే తన జీవితాన్ని మీదుకట్టేస్తుందనీ ఆయన మొదట్లో అంటూఉండేవారు. అసలు మాలో ఇంతలేసి ప్రపంచాన్ని ఘరమ్మత్తుచెయ్యాలన్న కోరికలు విస్తరించడానికి ఆయన ఈ అభిప్రాయాలే మూలకందము లయిఉండవచ్చును.

ఆ వేళ ఉదయం కమల ఏడుపుమొగంతోనే చెప్పింది, అదివరకు ఇంట్లో అటువంటి ప్రసక్తి ఏమీ లేకుండానే, హఠాత్తుగా పెళ్లి వాళ్లనాన్న తన పెళ్లిసంబంధం నిశ్చయంచేసుకొని వచ్చేరని. వాళ్లమ్మ బైటుండడంచేత ఇంట్లో వంటపని తనే చెయ్యవలసి ఉన్నా, ఎలాగో ఒక అరగంట వీలుకలుగజేసుకొని వచ్చి చెప్పింది. నేను వెంటనే ఏమీ చెప్పలేక పోయేను. కాని, ఆ కూర్చోవడం అలా మధ్యాహ్నం పన్నెండుగంటలవరకూ కదలకుండా కూర్చొని ఆలోచించేను. మా అభిప్రాయాలూ, ఆశయాలూ కేవలం ఊహలుగామాత్రమే అంతరించిపోవలసినవేతప్ప, అంతకంటే వాటిని ఆచరణలోపెట్టే సావకాశం ఇద్దరికీ లేదన్న నిశ్చయానికి వచ్చి ఆ మాటలే కమలతో చెప్పాలనుకొన్నాను. ఇప్పుడు నా సలహా, ప్రోత్సాహమూ లేకపోతే ఆమెపెళ్లి ఆగిపోతుందని కాదు గాని, అవి ఇవ్వగలగడం నాకు తృప్తి, పుచ్చుకోవడం ఆమెకు తృప్తి. ఆ మధ్యాహ్నం బయలుదేరి వాళ్లింటికి పెళ్లి నా కొత్త ఆలోచనలన్నీ చెప్పేను. వాటి మూలంగా, నిజంగా నేననుకొన్నకంటే ఎక్కువగానే సంతోషించింది కమల. "అయితే ఇంతకాలం ఇద్దరం ఇంతగా కలిసిమెలిసిఉన్నందుకు ఇప్పుడే నీ పెళ్లి కూడా అయిపోతే ఎంత బాగుంటుందే. ఇదొక్కటే నా విచారం"అంది.

"అన్నీ మనం కావాలనుకొన్నట్లుగానే జరుగుతాయా ? కాక ఇప్పుడు నీపెళ్లి అంటే ముఖ్యంగా వేడుక నాకు ; తరవాత నాపెళ్లి అంటే వేడుక నీకు" అని ఏదో నామట్టుకు నాకే తృప్తిగా లేని సమాధానం చెప్పేను.

ఆ తరవాత ఇరవై రోజులూ నా ఆరోగ్యం ఏమీ బాగుండలేదు. ఏదో ఒకవిధమయిన అస్వస్థత. ఆ రోజుల్లో కమల ఒకటి రెండుమార్లు మాయింటికి వచ్చింది గాని, పూర్వం గంటలతరబడిని అంతులేకుండా మాట్లాడే ఆ పద్ధతి తప్పిపోయింది. నేను తనపెళ్లిగురించీ, కాబోయే భర్తఉద్యోగంగురించీ, ఆ సంగతులు ఆమెకు తృప్తికలిగిస్తాయని మాట్లాడేదాన్ని ; తను నా అస్వస్థతగురించీ, మాఅక్కయ్యల రాకపోకల గూర్చీ ఏమేమో అడిగేది. ఏమి మాట్లాడినా, ఎన్ని సంగతులు మార్చినా ప్రతి నాలుగేసిమాటలతోనూ సూత్రం తెగిపోయి, 'మరింకేమిటి సంగతులు' అని జ్ఞాపకం చేసుకోవలసివచ్చేది.

చివరికి పెళ్లివేళకి నాకు జ్వరం. అయినా బాగుండదని వెళ్లేను. కమలే నావళ్లు పట్టుకొని చూసి,

"వెళ్లి పడుకో శకుంతలా! నిజమే నువ్వు లేకపోతే నాకదేమోలాగుంది. అసలు నా పెళ్లి వేడుకంతా నీదే నన్నావు. అటువంటిది వేళకి నీకే జ్వరం రావాలా? ఊఁహుఁ, ఇక్కడ వద్దు, గోలగా ఉంది, మళ్లీ బండీ మీదే ఇంటికి వెళ్లి పడుకో" అంది.

ఇంటికి, తిరిగివచ్చేసిన కొద్దిసేపటికే నా జ్వరం పూర్తిగా తగ్గిపోయింది; కాని చిత్రంగా రెండు ఫర్లాంగులదూరం ఉన్నా పెళ్లిమంత్రాల ధ్వనులూ, వాద్యాలనాదమూ స్ఫుటంగానే వినిపించసాగాయి. ఆ వినిపించడం కేవలం నా చెవులద్వారా మనస్సుకి అందిందో, మనస్సే స్వయంగా విందో నిర్ధారణగా చెప్పలేను...

ఆ సాయంత్రం పక్కమీద అటుకాదని ఇటూ, ఇటుకాదని అటూ ఒత్తిగిలి పడుకొంటూ అప్పుడప్పుడే కొద్దిగా మగతనిద్రపడుతూన్న సమయంలో ఆ రాత్రంతా నన్ను మేలుకొనిఉండేలాగ చేసిన మాటలు వినిపించేయి.

"అప్పుడు మనం ఇల్లుకొన్నది పదిహేనువందలకి; మరమ్మత్తు పెట్టినది ఒక అయిదువందలకంటె ఎక్కువ లేదు. ఇవాళ వాళ్ళెంతట వాళ్లు అయిదువేల అయిదు వందలు ఇస్తామన్నారు; మనం ఇష్టపడితే ఆరువేలకి లోటుండదు. రిజిష్ట్రేషనుఖర్చులుకూడా వాళ్లే పెట్టుకొంటారు. ఆడబ్బు పెట్టి పెళ్లంటూ చేసేస్తే, మనకేముంది, అప్పుడు రమణయ్యసెట్టి తన సేల్సుటాక్సు లెక్కలూ, ఇన్కమ్టాక్సులెక్కలూ చేస్తే నెలకి ఇరవై రూపాయలిస్తానన్నాడు. నేనే బద్ధకించేసేను. ఇప్పుడీరోజూ చదరంగం ఆడేబదులు, ఓపిక పడి అవి రాసి, మరొకచోటకూడా లెక్కలురాయడమో, ముగ్గురునలుగురు పిల్లలకి ప్రైవేటుట్యూషన్లు చెప్పడమో చేస్తే ఎంతలేదన్నా మరొక ఇరవై రూపాయలు రాకపోవు. ఏదయినా ఇప్పుడీఇంటద్దెవచ్చిన పాటి కాకపోదు. కాక, ఆ ఉన్న ఒక్క మడిచక్క అమ్మడంకంటె ఇదే మేలు. అక్కడ ఖరీదులు ఏమీ రావడంలేదు. మనల్ని నొక్కడులో పెట్టి చవగ్గా లాగాలని, కామన్న భుక్తవెత్తు...ఏమంటావు. నేనింకా ఆలోచిస్తానన్నాను మాటవరసకి. రేపు మంచిది కాదు. ఎల్లుండే పురోణీ రాయించేస్తాను—ఆరు వేలకీ కొంచెం అటూ ఇటూలోను. డబ్బంటూ చేతిలో ఉంటే పెళ్లికేం, నెల్లాళ్లలో చేసేస్తాను." అని ఒక పెద్ద ఉపన్యాసం చెప్పేరు. మా అమ్మ అంతా విని, తక్కిన విషయాల్లో తనకేమీ అభిప్రాయభేదం లేదన్నట్లుగా, "ఇల్లంతా అమ్మకుండా ఇప్పుడు మనం ఉన్న ఈభాగం ఉంచుకొందికి వీలుండదా?" అంది..... "అంతా అమ్మితేనే ఖర్చులకీ కట్నానికీ చాల్తుందో చాలదో అనుకొంటూంటే ఇంకా కొంత ఉంచుకోడంకూడానా? నీభయం నాకు తెలియనిది కాదు కాని, మరేం అంత భయపడక్కర్లేదు. నాకంఠంలో ప్రాణం ఉండగా నేను నిన్ను పోషించకపోలేను. తరవాతనా, ఏకూతురుదగ్గరున్నా నీకు మహారాజులా గడిచిపోతుంది. వాళ్లు నీకేం ఉచితార్థంగా తిండి పెట్టవలసిన పనిలేదు. ఆ ఉన్న మడిచక్క ఎవళ్లు నీకు కష్టానికీ సుఖానికీ అయితే వాళ్లకే ఇస్తావు. మరి నువ్వు కాదనకు. అసలు ఇన్నాళ్లూ ఇంత బద్ధకంగా ఎందుకు ఊరుకున్నానా అనే ఇప్పుడు కించగా ఉంది. రేపు లేదు, ఎల్లుండి ఈసరికి పురోణీ అయిపోయి వెయ్యిరూపాయలు చేతిలో పడి తీరవలసిందే—" అని పెరట్లోకి వెళ్లిపోయేడు మా నాన్న. తరవాత మాటలు మరి వినిపించలేదు, వినిపించవలసిన అవసరంకూడా లేకపోయింది.

ఆ రాత్రి నామనస్సులో రేగిన తుపానుఉద్ధతి ఇంతా అనీ, అది ఆయాప్రకారాలుగా విజృంభించిందనీ నేను నిబ్బరంగా చెప్పలేను. ఎన్నెన్నో ఆలోచనలూ, ప్రత్యాలోచనలూ లేచి ఒకదానితో ఒకటి సంఘర్షణపడి ఏదో బ్రహ్మాండమయిన హోరు ఉద్భవించింది మనస్సులో.

నాకు పెళ్లిచేసి నన్ను సుఖపెట్టడంకోసం అరవై యేళ్లు దాటిన నాన్న ఈఉన్న ఇల్లు అమ్మేసుకొని, నిశ్చయంలేని నాఖరీలలో దుర్బలంగా పడికొట్టుకొంటూ ఉండడమా? పాపం, తనకి భోజనంకూడా అక్కర లేదు చదరంగం ఉంటే. అటువంటిది, నామూలంగా ఆట మానుకొని ఈవయస్సులో పాటుపడడమా?

పడినా డబ్బు వస్తుందని నమ్మకంలేదు. తీరా చెయ్య బోతే, ముసలివాడవు నువ్వేం చేస్తావయ్యా అంటారు. అటువంటి పరిస్థితులు కల్పించి నాకేమీ సంబంధం లేదన్నట్లుగా చూస్తూఊరుకోవడం అసలే నేను చెయ్య లేని పని.

ఇక మరేమి టున్నాయి సాధనాంతరాలు? ఏదో ఉద్యోగం సంపాదించుకొని బ్రతకడం. వాటిలో స్కూలుమిస్ట్రెస్‌పని చెయ్యడానికయితే రెండేళ్లు ట్రెయినింగు కావాలి. అస లది అమ్మకే కాదు, నాన్నకికూడా ఎంతమాత్రం ఇష్టంలేని పని. కాక, నేను ఏమీ బాధపడడం లేదు, నా కెంతో ఉత్సాహంగా ఉందన్నా వాళ్లు నమ్మలేరు. ఇదివరకు రెండుమూడు మార్లు ట్రెయినింగుకి వెళ్తాననడం జరిగింది. ఒప్పుకోక పోవడమే కాదు, ఆరకం ఆలోచన పెట్టుకోవడం కూడా ఎంతో తెలివితక్కువ, అవమర్యాదాకరమయిన పనీ అన్నట్లుగా మాట్లాడేరు వాళ్లిద్దరున్నూ. వాళ్ల ఇష్టానికి విరుద్ధంగా రెండేళ్లు ట్రెయినింగు అవడం అసంభవం; అవందీ ఉద్యోగం దొరకదు. ఇక ఏ నర్సు పనిలో ప్రవేశించాలన్నా ఏంచెయ్యాలన్నా బాగా ప్రయత్నించాలి; కొన్నాళ్లు ఓపికపట్టాలి. అంతే కాని అనగానే కావుకదా. అయితే ప్రస్తుతస్థితి అంత నిడివిమీద ఆలోచనలు జరపడానికి వీలుగా లేదే. రేపు లేదు ఎల్లుండి నిశ్చయంగా ఇల్లు అమ్మే స్తారు; ఈ సందర్భంలో నాన్నతో వాదించి ఒప్పిం చడం బ్రహ్మతరం కాదు.

ఇక మిగిలిఉన్నవి రెండే పద్ధతులు. ఒకటి ఆత్మహత్య, రెండవది, తరవాత ఏవిధంగా పరిణ మిస్తుందో తెలియని, నాకు అసలే ఇష్టంలేని పనికి సిద్ధపడడం.

ఆత్మహత్య చేసుకోడం అంటే ఏమంత కష్ట మయిన పనిమాత్రం కాదు. ఎంచేతంటే నాకళ్లతో నేను, నూతిలో పడి చచ్చిపోయిన మనుష్యులను చూసేను. ఇంకొకామెను నీటిలో పడిన కొద్దిసేపటికే బైటికి తీసినా తెలివి తప్పిపోయిఉంది. వెంటనే డాక్టర్లు వచ్చి కృత్రిమశ్వాస కల్పించడమూ, ఇంకా తగిన శ్రద్ధ తీసుకోవడమూ మూలాన బ్రతికింది. అయితే మాత్రం బైటికి తీసేసరికి ఆమెకి ఒంటిమీద స్పృహ లేదు. అందుచేత పడీపడడంలో ఏకొంచెమో బాధ ఉన్నా తరవాత చచ్చిపోయేవరకూ ఏమీ తెలియదు. సగంరాత్రిప్పుడయితే తెల్లవారేలోపున ఏమీ అను మానం లేకుండా అంతా పూర్తిఅయిపోతుంది— అయితే మంచి విషం దొరికితే ఇంతకంటే కూడా మంచిదేకాని, తక్కిన రైలుక్రింద పడడం, కాల్చు కోవడం మొదలయిన పద్ధతులకంటే నీటిమూలంగా చావే సులభమయినది. కాగా, ఈ విధానంలో నామటుకు నాకేం అనుమానం లేదు, బాగానే ఉంటుంది. తరవాత నాశరీరం ఉండదు, మనస్సో ఆత్మో అది ఉంటుందో ఉండదో తెలియదు— నిజమే. కాని ఇంతా నేను ఏఉద్దేశం అయితే మన స్సులో పెట్టుకొని ఆత్మహత్య చేసుకొంటున్నానో, అది నెరవేరుతుందా? అమ్మకీ నాన్నకీ నాపెళ్లివల్ల ఇల్లుండదు, తరవాత ఆయన ఏవేవో నౌఖరీలు చెయ్య వలసివస్తుంది. అటువంటి సంకటపరిస్థితులు రాకుండా వాళ్లిద్దరూ హాయిగా నిర్విచారంగా ఉండాలనికదా నే ననుకొంటున్నాను. నేనేగాని ఆత్మహత్య చేసు కొంటే తరవాత వాళ్లు హాయిగా మనగలరా? పైగా ఎంత అపఖ్యాతి. నలుగురిలోనూ మరి జన్మలో తల ఎత్తుకొని తిరగగలరా? వీళ్ల చేతకానితనంకారణంగా వీళ్లమ్మాయి ఆత్మహత్య చేసుకొందన్న వాదు భరించి తీరాలికదా...అప్పుడు ఈ కారణాలన్నీ నామన స్సులో మెదిలేయి అనడానికేమీ అనుమానం లేదు గాని, ఇంత స్పష్టంగా, ఒకదానితరవాత ఒకటి చొప్పునమాత్రం మనస్సులోకి రాలేదు అని ఒప్పుకో వాలి. ఆ తుపానుపరిస్థితిలో ఇంత శాంతం ఎక్కడిది? మూడుమార్లు తొందరతొందరగా పెరట్లోకి వెళ్లేను; అంతకంటే తొందరగా తిరిగివచ్చి మంచంమీద కూల బడ్డాను. ఒకమారు నూతిదాకా కూడా వెళ్లేను. మరొక్కక్షణం ఆ ఉద్వేగం నిలబడిఉంటే, మరిప్పు డిన్ని ఆలోచనలు చెయ్యవలసిన అవసరం, అవకాశం కూడా లేకుండాపోయేది.

కాక, ఆత్మహత్య చేసుకోవడంవల్ల అమ్మకీ నాన్నకీ ఏసౌఖ్యం కావా లనుకొంటున్నానో,

ఆ సౌఖ్యానికే వాళ్లని పూర్తిగా దూరంచెయ్యడం జరుగుతుంది. అంతకంటే ఎల్లా—అయేది అల్లా అవుతుంది, నాకేం పూచీలేదని ఊరుకోవడమూ కొంత నయమే. ఏమంటే ఆపద్ధతిలో వాళ్లు ఎన్ని ఇబ్బందులు పడుతున్నప్పటికీ మనస్సుకిమాత్రం తమ విధిని తాము నిర్వర్తించేమన్న తృప్తి ఉంటుంది.

ఇక మిగిలిఉన్న మూడవపద్ధతివల్ల మా అమ్మకీ నాన్నకీ ఒకప్పుడు నిజంగానే సంతోషం కలగవచ్చును. లేదా, కొంత మనస్తాపమూ, నాయెడల కోపమూ కలగవచ్చును. అంతేకాని వాళ్లు స్వయంగా పెద్ద కష్టనష్టాలు భరించనక్కరలేదు. కాని, అందుకుగాను నేను (పరిస్థితులు ఎదురుతిరిగితే) జీవితం ఉన్నంతకాలం ఫలితం అనుభవించవలసిన ఆత్మహత్యకి సిద్ధపడాలన్న మాట...

నాఆలోచన అలా ఇంకా జరుగుతూనేఉంది. ఎటూ ఒక బలమయిన నిశ్చయానికి రాకుండానే తెల్లవారిపోయింది.

అప్పుడు ఒక్కమారు మెరుపుమెరిసినట్లయింది మనస్సులో. అంతరాత్రిపొడుగునా వితర్కించి, మూడుమార్లు నూతిదగ్గరకు వెళ్లి కూడా ఆత్మహత్య చేసుకోకపోవడం ఉందే, మరి ఆపని జరగవలసింది కాదని విధినిర్ణయం అయిఉంటుందని, ఆ స్ఫురణతో కొత్తగా ఉత్సాహం, బలం వచ్చినట్లనిపించింది. ఏదో పాడుకొంటూనే పక్కమీదినుండి లేచేను. మా అమ్మ మొగంలో అదివరకు కొన్నిసంవత్సరాలుగా కనబడని సంతృప్తి చాలా స్పష్టంగా కనిపించింది. — ఆవేళ ఉదయం మాఅమ్మ ఇచ్చిన కాఫీఅంత రుచిఅయిన కాఫీ ఇప్పటికి మరి ఒకటి రెండుమార్లుమాత్రమే రుచి చూసేను.

కాఫీ తాగగానే అద్దంలో చూసుకొన్నాను. రాత్రంతా నిద్రలేకపోవడంవల్ల కళ్లు ఎంతో ఎర్రగా ఉంటాయనుకొన్నాను. కాని, కళ్లలో మాత్రం ఏమీ భేదం కనబడలేదు. మొగం మొత్తంమీద కొంచెం బలహీనంగా ఉండడానికి జ్వరం కారణంగా చెప్పుకొన్నాను. అలా కొంతసేపు చూడగాచూడగా, రోజూ కనిపించే ప్రతిబింబంకంటే నీరసంగా ఉండడంచేతనో ఏమో అల్లా ఉండడమే ఎక్కువ అందంగా ఉన్నట్లనిపించింది.

ఊఁహూఁ, ఇల్లా కాలహరణం చేసి లాభంలేదు. కార్యరంగంలో దూకాలి. తొలినాటిరాత్రి అదివరకు మామూలుగా వెళ్లే నూతిదగ్గరకు వెళ్లడంలో పొందిన మనఃకల్లోలమంతా ఆఉదయం డాబామీదికి వెళ్లడంలో పొందేను. ఒకమారు మెట్లవరకూ వెళ్ళి, మా అమ్మ పిలవకపోయినా పిలుస్తున్నదనుకొని, దగ్గరకు వెళ్ళి 'అమ్మా, పిలిచావా?' అన్నాను. మరొకమారు సగం వరకూ మెట్లెక్కి దిగిపోయేను. కాని మళ్లీ గదిలో వెళ్ళి కూర్చునేసరికల్లా తొలినాటి రాత్రి వచ్చిన ఆలోచనలన్నీ మనసులోకి రావడం మొదలుపెట్టేయి. ఇక మరి లాభంలేదని, తొందరతొందరగా డాబా ఎక్కిపోయేను. అయితే అప్పుడయినా మళ్ళీ కొంతసేపు ఆలోచించవలసివస్తే మనసు ఎటు ఒరిగిఉండునో చెప్పలేను. కాని, ఎట్టఎదురుగా ఆయువకుడు రెండుపెంకుటిళ్ళ అవతల ఉన్న డాబామీద కనబడ్డాడు. అదివరకు డాబామీదికి నేను వెళ్ళినప్పుడల్లా అతను నావంక చూసేపద్ధతిని, బిగ్గరగా నాకు వినబడాలనో ఏమో సరాగంగా పద్యాలు చదివేపద్ధతిని నేను చాలా అసహ్యించుకొనేదానిని. అంతే కాదు, వెనకటిలా తరచుగా కాకుండా, ఎప్పుడో బట్టలు ఆరవెయ్యడం వంటి అవసరమయిన పని ఉంటేనే తప్ప డాబామీదికి వెళ్లడం మానుకొన్నానిటీవల. ఆరోజున చేతిలో ఆరవెయ్యవలసిన బట్టలు ఏవీ లేకుండా డాబామీద నేను కనబడడం అతనికి ఒకింత వింతగా తోచిఉండవచ్చును.

అంతదూరంలో ఉండి మాట్లాడాలంటే గొంతుచించుకొని, చుట్టుపక్కల అయిదారిళ్లవాళ్ళకి వినబడేటట్లుగా మాట్లాడాలి. కాబట్టి అది పనికిరాదు. ఇంకేమిటి చెయ్యడం, అని ఆలోచిస్తూఉండగానే, నాచేయి కదిలింది; పెదవులు చిరునవ్వు నవ్వేయేమో చెప్పలేను... నేను చేసిన చేస్తున్న పని ఏమిటో నామనస్సుకి నాటేలోపునే అతను మా డాబాపక్కన ఉన్న సందులో వచ్చి నిలబడి ఉన్నాడు.

అతని ముఖవైఖరి చూస్తే, దూరంనుండి అంత హంగామాచేసే మనిషి అయినా, దగ్గరకు వచ్చాక

ఏమో మాట్లాడదలచి పైటికి అనలేకపోతున్నట్లుగా రూపించింది. నాకూ మాట్లాడ్డానికి సంకోచంగానే ఉన్నా ఆవిధంగా నిలబడడం మరీ బాగుండదని, "మధ్యాహ్నం ఒంటిగంటకు వస్తారా, కొంచెం మాట్లాడాలి" అన్నాను. అతను "తప్పకుండాను" అన్నాడు. అంతే...

రివ్వున డాబా మెట్లు దిగి నా గదిలోకి వెళ్లేను. అంతవరకూ తొంగిచూడనైనా చూడని సందేహాలన్నీ ఒక్కమారుగా ఉప్పెనలా వచ్చిపడ్డాయి. అతను వివాహితుడేమో! అయితే మొదటి ఉద్దేశానికే భంగం. కాకపోయినా నన్ను పెళ్లిచేసుకోడానికి ఇష్టం ఉండకపోతే, ఉన్నా, తన ఇష్టంకంటే వాళ్లవాళ్ల ఇష్టమే ప్రధానం అన్న రకం మనిషి అయితే,...ఊరికే తమాషాకి అన్నట్లుగా నావంక చూస్తున్నాడేమో...

ఉదయం పక్కమీదినుండి లేవగానే మహానిబ్బరంగా ఏమీ అనుమానించవలసిన అవసరం లేదన్నట్లుగా రూపించిన ఆలోచనలే, మంచు కరిగిపోయినట్లుగా కరిగిపోయేయి—పోనీ ఊరికే ఆలోచనలు ఆలోచనలుగానే ఆగిపోకుండా ఈ తగాదా ఒకటి తెచ్చిపెట్టుకొన్నాను— ఎంత ధైర్యం, పట్టపగలు దగ్గరసా రమ్మని పిలిచేను. మట్టమధ్యాహ్నం బాహాటంగా రమ్మని చెప్పేను. ఎవళ్ళయినా చూసే ఉంటారు. ఇక నిప్పుడు మరి వెనక్కి తిరగడానికి కూడా వీలున్నట్లు కనబడదే—

ఆ ఉదయం ఏమీ భోజనం చెయ్యలేకపోయేను. మా అమ్మ మళ్లీ ఉష్ణం వచ్చింది కాబోలంది. నేను ఎంత లేదన్నా తాను నమ్మలేదు నామాటను.

రోజు ప్రొద్దెక్కుతూ పండ్రెండు గంటలకి దగ్గరపడుతున్నదనగా ఏదో ఫలానా అని తేల్చుకోబడని గాభరా. ఆ గాభరాలోనే నాకు నేను ధైర్యం చెప్పుకొన్నట్లు అనుకొన్నాను. అతని కులగోత్రాలు ఏమయినా సరే, మనిషి ఎటువంటివాడయినా సరే, అవివాహితుడయి కట్నం అక్కరలేకుండా పెళ్లిచేసుకొందికి ఇష్టపడితే చాలును. చివరికి, ప్రస్తుతం పెళ్లిచేసుకొందికి వీలులేకపోతే కలిసి లేచిపోవడానికయినా ఒప్పుకొంటే బాధలేదు, తరవాత సంగతి వెనకనించి ఆలోచించవచ్చును. అని అనిపించింది.

ఆవేళ మామూలుగా పన్నెండుగంటలకి భోజనానంతరం మాఅమ్మా నాన్నా నిద్రపోయేరు. అట్టేసేపు ఎవళ్లయినా చూస్తారేమో నని బితుకుగా కాలంగడపనక్కరలేకుండా అతను వచ్చేడు సరిగా పన్నెండు అయేసరికల్లా.

ఇక మరి అట్టే చెప్పనవసరం లేదనుకొంటాను.

మాఅమ్మా నాన్నా - ముఖ్యంగా నాన్న - నా స్వతంత్రతగురించి కొద్దిగా కేకలువేసినా లోలోపల బాగానే సంతోషించిఉంటారు.

మరొక్క పదిరోజులలో మా పెళ్లి ఏమీ ఆడంబరం లేకుండా మామూలు చిన్న కుటుంబాలలో బారసాలవంటి అప్రధానమయిన కార్యం జరిగినట్లుగా జరిగిపోయింది. అయితే ఈ సందర్భంలో మామూలు సాంఘికపు కట్టుబాట్లకి పొరపొచ్చం రాని మనిషి మా ఆయన కావడం కేవలం నా అదృష్టం అనుకోండి. అయితేమాత్రం, నా నిశ్చయంలో నేనేమయినా సరే మాఅమ్మా నాన్నా నాకారణంగా ముసలికాలంలో ఆర్థికమయిన ఇబ్బందులపాలు కాకుండా ఉంటే చాలునన్న త్యాగబుద్ధి మిళితమైఉన్నట్లే కనిపిస్తుంది. కాని, ఒకమనిషి హఠాత్తుగా నలుగురికీ విదితమయేలాగ ప్రాణం తీసుకొంటేనే తప్ప, నిత్యకృత్యంలో సామాన్యంగా చేస్తూఉండిన, అంతకంటే క్లిష్టతరమయిన త్యాగాన్ని గుర్తించకపోవడమన్నది ఒక్క నా విషయంలోనే జరగడంలేదన్న సంగతిమాత్రం నాకు తెలియనిదికాదు. అయితే నామటుకు నాకు ఇది నా జీవితంలో ఎంతో ముఖ్యమయిన ఘట్టంగనక నలుగురికీ తెలియవలసిఉందన్నంత ఉత్సాహంతో రాసేను. నిజానికి ప్రతివాళ్ల జీవితంలోనూ వాళ్లమటుకు చాలా ముఖ్యంగా తోచి, లోకం ఏమీ గుర్తించని ఘట్టాలు ఉంటూనేఉంటాయి కాబోలు.

---